www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 8 నవంబరు 2022
5
ఏలూరు

రెడ్ క్రాస్ అంబులెన్స్ ప్రారంభం

ఏలూరు అర్బన్:రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో కెనడియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన నూతన రెడ్ క్రాస్ అంబులెన్స్‌ను కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ ప్రసన్న వెంకటేష్ సోమవారం జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల సమయాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుకు, అత్యవసర పరిస్థితుల్లో రెడ్‌క్రాస్ అంబులెన్స్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సొసైటీకి సూచించారు. జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.జెన్నీ మాట్లాడుతూ కలెక్టర్ సూచనలతో సంస్థ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నూతన రెడ్ క్రాస్ అంబులెన్స్‌ను సేవా కార్యక్రమాల్లో వినియోగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎవి.సత్యనారాయణమూర్తి, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, జెడిపి సిఇఒ రవికుమార్, మునిసిపల్ కమిషనర్ షేక్ షాహిద్, రెడ్ క్రాస్ కార్యదర్శి బి.జెన్నీ, ఎ.ప్రియాంక, సిహెచ్.అనూష, ఎ.సూర్యనారాయణ, కెవి.రమణ, రెడ్ క్రాస్ ఎన్ఎం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధన లక్ష్మి

ఆశాలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

రాజకీయ వేధింపులు దారుణం

రిటైర్డ్ బెనిఫిట్స్ చెల్లించాలి

జిల్లా మూడో మహాసభలో ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు

ఆశ వర్కర్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మూడో మహాసభ జరిగింది. ఈ మహాసభకు జిల్లా అధ్యక్షులు డి.జ్యోతి, పి.కమల, మేరీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ధనలక్ష్మి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఆశా వర్కర్లకు కనీస వేతనాలివ్వకుండా ప్రభుత్వాలకు చేతులు రావడం లేదని విమర్శించారు. ఆశా వర్కర్లతో వారికి సంబంధం లేని పనులు చేయిస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అనేక చోట్ల రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆశ వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు రూపాయి కూడా పరిహారం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇటీవల గుంటూరు జిల్లాలో ఆశా వర్కర్ రమావత్ లీలావతి విధి నిర్వహణలో ఉండగా అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమని, ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కె.సోమమ్మ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టి మాట్లాడారు. మూడేళ్ళ కాలంలో జిల్లాలో ఆశ వర్కర్ల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించామన్నారు. సిఐటియు నాయకులు కె.రాజా రామ్మోహన్‌రాయ్, డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు ప్రసంగించారు. మహాసభలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చింతపల్లి లక్ష్మి, లారెన్స్ కుమారి, కామేశ్వరి, దేవి, రోజా, తులసి, దుర్గ ప్రసంగించారు.

వ్య.కా.స రాష్ట్ర మహా సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కలిదిండి

వచ్చేనెల ఎనిమిది, తొమ్మిది, పది తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. కలిదిండిలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతాంగం సహాయ, సహకారాలు అందించాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శేషు మహంకాళిరావు, నాయకులు జె.మహేష్, చిన్నం శ్రీకాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ముసునూరు : రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిల్లి మురళీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముసునూరులో కరపత్రాలు పంపిణీ ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిన్నిబోయిన శ్రీనివాసరావు, రెడ్డి తిరుపతిరావు, జ్ఞానేసు, ఛార్లెస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతున్న నాయకులు

లస్కర్ల పాట్లు..!

- ఏడు నెలలుగా అందని జీతాలు
- 12 నెలలు పని.. పది నెలలకే జీతాలు
- ఎప్పుడో నిర్ణయించిన రూ.10,500 జీతమే ఇప్పటికీ
- ప్రతినెలా జీతాలిచ్చేలా చర్యలు శూన్యం
- సాగునీటి పంపిణీలో లస్కర్లదే కీలకపాత్ర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న లస్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదిపాటు పని చేయించుకుని పది నెలలకే జీతాలివ్వడంతోపాటు సకాలంలో జీతాలివ్వకపోవడం వంటి కారణాలతో లస్కర్లు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. తమకు ప్రతినెలా జీతాలు అందించేలా చర్యలు తీసుకోవడంతోపాటు జీతాలు పెంచాలని ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ లస్కర్లు కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకొని పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెల్టా పరిధిలో 5.29 లక్షల ఎకరాల్లో వ్యవసాయ సాగు ఉంది. గోదావరి నుంచి ప్రధాన కాలువల ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరు సరఫరా సాగుతోంది. ఈ నీటిని సక్రమంగా పంపిణీ చేసే బాధ్యత లస్కర్లపైనే ఉంటుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 197 మంది లస్కర్లు పని చేస్తున్నారు. మొత్తం ధవళేశ్వరం డివిజన్ పరిధిలో 600 మంది వరకూ పని చేస్తున్నారు. వీరంతా కాంట్రాక్ట్ ఉద్యోగులే. జూన్ నుంచి మార్చి నెలాఖరు వరకూ పది నెలలు పని చేసే ప్రాతిపదికన వీరిని తీసుకుంటారు. అయితే పంట కాలువలు మూసేసినప్పటికీ ప్రతియేటా ఏప్రిల్ నెలాఖరువరకూ, మెయింటెనెన్స్ వంటి కారణాలతో మే నెలలోనూ వీరితో అధికారులు పని చేయించుకుంటున్నారు. జీతం మాత్రం జూన్ నుంచి మార్చి వరకూ పది నెలలకు మాత్రమే ఇస్తున్నారు. ఎప్పుడో ఏళ్ల కిందట నిర్ణయించిన రూ.10,500 జీతాన్నే ఇప్పటికీ ఇస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు పెద్దఎత్తున పెరిగినా లస్కర్ల జీతాల్లో మాత్రం పెంపు లేకుండాపోయింది. రెగ్యులర్ లస్కర్లకు రూ.50 వేలకుపైగా జీతాలుండగా అదేస్థాయిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న లస్కర్లకు మాత్రం అందులో సగం జీతం కూడా ఇవ్వని పరిస్థితి.

రబీ సీజన్‌లో కష్టాలు వర్ణనాతీతం

ప్రతియేటా రబీ సీజన్‌లో సాగునీటి కొరత వెంటాడుతూనే ఉంది. సాగునీటి కొరత కారణంగా వంతులవారీ విధానం అమలు చేసి ప్రభుత్వం పంటను గట్టెక్కిస్తోంది. రబీలో సాగునీటి పంపిణీ వ్యవహారం కత్తిమీద సాములా మారుతోంది. జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకూ వంతులవారీగా నీటిని విడుదల చేసి సక్రమంగా జరుగుతుందా.. లేదా అని చూసే బాధ్యత లస్కర్లపైనే ఉంటుంది. ప్రతిరోజూ తక్కువగా లెక్కించినా కాలువల వెంట 20 నుంచి 30 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. ఈ విధంగా ప్రతిరోజూ కష్టపడాలి. రబీ సీజన్‌లో అటు రైతుల నుంచి, ఇటు అధికారుల నుంచి లస్కర్లపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా కాలువల వెంట తిరిగి సాగునీరు సరఫరా అయ్యేలా చూడాలి. వ్యవసాయ సాగులో ఇంతటి కీలక పాత్ర పోషిస్తున్న లస్కర్లకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వకపోవడం దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రతినెలా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని లస్కర్లు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ప్రభుత్వంగాని, అధికారులుగాని పట్టించుకోవడం లేదు. ఒక్కో లస్కర్‌కు ఏడు నెలల జీతం రూ.73 వేలకుపైగా రావాల్సి ఉంది. ప్రతియేటా సాగునీటి సలహా మండలి సమావేశంలోనూ లస్కర్ల జీతాలపై చర్చ జరగడం, మళ్లీ అదే సమస్య పునరావృతం కావడం పరిపాటిగా మారింది. ఈ నెలాఖరునగాని, వచ్చే నెలలోగాని జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం జరిగే అవకాశం ఉంది. లస్కర్ల సమస్య మళ్లీ తెరపైకి రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా లస్కర్ల సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

అంతటా అయోమయం.. రోగుల్లో గందరగోళం..!

మారుతోన్న జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి ముఖచిత్రం

రిఫర్‌ల వైపే మొగ్గు

కొత్త సూపరింటెండెంట్ వైఖరిపై సిబ్బంది గుర్రు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులోని జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రి ముఖచిత్రం క్రమేపి మారుతోంది. ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ వైద్య, విధాన పరిషత్ పరిధిలో ఉన్న ఈ ఆసుపత్రిని కొద్దిరోజుల క్రితమే వైద్య, విద్య కళాశాల (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) పరిధిలోకి రావడంతో దానికి తగినట్లుగానే అధికారులు మార్పులు చేపట్టారు. ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లు ఉండే విభాగాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. కొన్ని ఇన్‌పేషెంట్ల విభాగాలను మాత్రమే ఉంచి మిగిలిన వాటిలో ఆధునికీకరణ పనులను చేస్తున్నారు. రోజువారీ వచ్చేరోగులకు అవుట్ పేషెంట్ల విభాగాలను అందుబాటులోనే ఉంచారు. అయితే ఈ విషయంపై రోగుల్లో గందరగోళం నెలకొంది. గతంలో ఇక్కడకు వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైతే వారిని ఆసుపత్రిలో చేర్పించేవారు. కానీ ప్రస్తుతం వైద్యులు ఆ పనులను చేయడం లేదు. ఎక్స్‌రే విభాగంలో ఫిల్మ్ ఇచ్చే విధానం తీసివేశారు. కనీసం రోగి గానీ, రోగి సహాయకులు గానీ ఫొటో తీసుకునే వెసులుబాటు కూడా కల్పించడం లేదు. ఆ ఎక్స్‌రే ఫొటోను వైద్యుల వాట్సాప్ గ్రూపులో పెడుతున్నారు. సోమవారం ఆసుపత్రికి వచ్చిన ఓ రోగికి ఎక్స్‌రే విషయంలో చేదు అనుభవం ఎదురైంది. 11వ నంబరు వార్డులో ఉన్న వైద్యురాలు ఎక్స్‌రే తీయించుకురావాలని సూచించడంతో ఆ రోగి ఎక్స్‌రే తీయించుకున్నాడు. దానికి సంబంధించిన ఫిల్మ్ ఇవ్వకుండా కేవలం రిపోర్టు కాగితాలను మాత్రమే అతనికిచ్చి పంపించారు. తీరా వాటిని పట్టుకుని ఆ వైద్యురాలి వద్దకు వెళ్తే ఇందులో ఏమీ లేదని రిపోర్టు వచ్చిందని, ఎక్స్‌రే ఫిల్మ్ ఉంటే తీసుకువస్తే దాన్ని పరిశీలించి చెబుతానన్నారు. తీరా అక్కడికి వెళ్తే గ్రూపులో పెట్టామని బదులిచ్చారు. తిరిగి వైద్యురాలి వద్దకు వస్తే తాను జూనియర్ డాక్టర్‌నని, తాను ఆ గ్రూపులో ఉండనని, పెద్ద డాక్టరు వద్దకు వెళ్లాలని సూచించారు. దీంతో అతను ఎవరి వద్దకు వెళ్లాలో? ఎక్కడికి వెళ్లాలో? తెలీక చివరకు ఓ ప్రయివేటు ఆసుపత్రిని ఆశ్రయించాడు. ఇదే విధంగా రోగులు ఆస్పత్రిలో ఏం జరుగుతుందో? ఎవరి వద్దకు వెళ్లాలో తెలీక ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

అయితే గుంటూరు.. లేకుంటే విజయవాడ..!

ఆస్పత్రికి వచ్చే కేసుల్లో అధికశాతం విజయవాడ, గుంటూరు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. కొంచెం సీరియస్‌గా ఉన్న కేసు వస్తే చాలు వెంటనే రిఫర్ చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. దీంతో చాలామంది రోగులు అంతదూరం వెళ్లలేక ఇక్కడే ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. నిరుపేదలు మాత్రం విజయవాడ, గుంటూరు వెళ్తున్నారు. దీంతోపాటుగా కొత్త సూపరింటెండెంట్ వ్యవహారశైలిపై పలువురు సిబ్బంది గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఆయనతో సిబ్బందితో దురుసుగా వ్యవహరిస్తున్నారని, అతి కొద్దికాలంలోనే రిటైర్డ్ కాబోతున్నానని, తనకు ఏవరితో సత్సంబంధాలు అవసరం లేదనే విధంగా ఆయన వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇటీవల ఆయన తీరు బాగోలేదంటూ పలువురు సిబ్బంది ఆందోళన కూడా చేపట్టారు.

గిరిజనుల పోడు భూములకు పట్టాలివ్వాలి


ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తరతరాలుగా పోడుభూములు సాగుచేస్తున్న గిరిజనులకు హక్కు పట్టాలివ్వాలని ఎపి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏజెన్సీలో గిరిజనుల సాగులో ఉన్న పోడుభూములపై తక్షణం ఆర్‌ఒఎఫ్ఆర్ గ్రామసభలు నిర్వహించాలని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పట్టాలివ్వాలని, అటవీ హక్కు చట్ట సవరణ వద్దంటూ, డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు గిరిజన సంఘం బుట్టాయగూడెం మండల అధ్యక్షులు కారం భాస్కర్ అధ్యక్షత వహించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం తరతరాలుగా పోడు భూములు సాగుచేస్తున్న గిరిజనులందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడవులను కొద్దిమంది వ్యక్తులకు వేల ఎకరాలు కేటాయించేందుకు అటవీ హక్కుల చట్టాన్ని సవరిస్తోందన్నారు. అడవులను వ్యక్తులకు కేటాయించేందుకు కలెక్టర్ ఆమోదిస్తే సరిపోతుందని సవరణలు తీసుకురావడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ఈ చర్యలకు లక్షలాది గిరిజనులు అడవుల నుండి దూరమవుతారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యక్తులకు అడవులను కేటాయించేందుకు గ్రామసభల అవసరం లేదని మార్పు చేయడం బాధాకరమన్నారు. ఆదివాసులకు వజ్రాయుధంగా ఉన్న ఆర్‌ఒఎఫ్ఆర్ గ్రామ సభలు నిర్వీర్యమైతే ఆదివాసీలు పోడు భూములకు దూరమవుతారన్నారు. గ్రామసభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చట్టాన్ని నీరుగారుస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ వ్యక్తులకు అడవులను కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం సవరణ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తనవంతుగా సహకరించేలా చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాల అమలుకు బటన్ నొక్కే కార్యక్రమం తీసుకుందని లక్షలాది మంది ఆదివాసీలకు ఉపయోగపడే పోడు భూముల బటన్ ఎప్పుడు నొక్కుతారో స్పష్టం చేయాలన్నారు. అటవీ హక్కుల చట్టం వచ్చి 13 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో గిరిజనులకు పట్టాలిచ్చేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా లేవని విమర్శించారు. గత డిసెంబర్‌లో ఐటిడిఎ వద్ద పోడు సాగుదారులు వ్యక్తిగత దరఖాస్తు చేసుకున్నప్పటికీ నేటి వరకూ గ్రామ సభలు ఎందుకు నిర్వహించలేదో అధికారులు స్పష్టం చేయాలన్నారు. అధికారులు స్పందించి గ్రామ సభలు నిర్వహించాలని, లేనిపక్షంలో డివిజన్ కార్యాలయం ఎదుట నిరంతర ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో వినతిపత్రాన్ని ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పోలోజు నాగేశ్వరరావు, చంద్రు బుల్లెమ్మ, ఎం.పోచమ్మ, చోడెం దుర్గారావు, వెట్టి వీరయ్య, తెల్లం వెంకటలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామ ముత్యాలమ్మ, మండల కార్యదర్శి ఉడత వెంకటేష్, గిరిజనులు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని, వారికి రక్షణ కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గత నెల 30న కొమడవోలులో వాలంటీర్‌పై దాడికి పాల్పడిన వారిపై హత్య కేసు నమోదు చేయాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వాలంటీర్‌పై హత్య చేయడానికి ప్రయత్నించిన అగ్రవర్ణ భూస్వాములపై పోలీసులు కేవలం ఎస్‌సి, అట్రాసిటీ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రాకేష్‌పై దాడి చేసిన దోషులపై హత్య కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు ఐక్యంగా ఉద్యమించాలని బాలాజీ పిలుపునిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు జరపాల్సిన ముఖ్యమంత్రి చట్టాన్ని అతిక్రమిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిలో దళితులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎస్‌సి, ఎస్‌టి, సబ్‌ప్లాన్ పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, బాధితులు, నాయకులు కందుల రమేష్, కాపుదాసి రవి, ఎరికిపాటి విజయ్, నేతల రవి, భూపతి అప్పారావు, నల్లమెల్లి శంకర్, కొమ్మన అగస్టీన్, జాలాబాలాజీ, మేరుగు సతస్యనారాయణ, కె.మురళీ, చిన్నం సునీల్, ఉర్ల విద్యాసాగర్ పాల్గొన్నారు.

రక్త హీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - చింతలపూడి

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించి జిల్లాను రక్త హీనత రహిత జిల్లాగా మార్చేందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కృతనిశ్చయంతో ఉన్నారని సచివాలయ సమాచార విభాగం జిల్లా సమన్వయకర్త టిఎన్.స్నేహన్ అన్నారు. సోమవారం మండలంలోని మూడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. రెచర్ల, ఎర్రగుంటపల్లి గ్రామాల సచివాలయాలు సందర్శించారు. సచివాలయ ఉద్యోగులతో సమావేశమై పలుఅంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అంకితబావంతో పనిచేయాలన్నారు. జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న వారి కోసం కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారని చెప్పారు. జిఒ 132 ప్రకారం సచివాలయ ఉద్యోగులకు సూచించిన మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే కాకుండా ఇళ్ల వద్ద కిశోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు జరపాలన్నారు. ఎంతమందికి పరీక్షలు నిర్వహించారో వివరాలు సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులు, బాలింతల విషయంలో తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తం తక్కువగా ఉన్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని చెప్పారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలని సూచించారు. యగుంటపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో బాలికలకు 'రక్త హీనత - బాల్య వివాహాల నిర్మూలన' అంశంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహమనే రక్కసి కోరల్లో బాలికలు చిక్కుకోవద్దని సూచించారు. బాల్య వివాహం చేస్తే చట్ట ప్రకారం రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారని చెప్పారు. 112 టోల్ ఫ్రీ నెంబర్‌కు బాల్య వివాహాల సమాచారం అందించాలన్నారు. అనంతరం యర్రగుంటపల్లిలోని అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాబూరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు

మాట్లాడుతున్న టిఎన్.స్నేహన్

స్పందన అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజల్లో సంతృప్తిస్థాయి పెంచే విధంగా స్పందన అర్జీల పరిష్కారం ఉండాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 209 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జెసి పి.అరుణ్‌బాబు, డిఆర్ఒ ఎవి.సత్యనారాయణమూర్తి, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించడానికే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి పారదర్శకంగా విచారణచేసి అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఏ అర్జీకూడా రీఓపెనింగ్‌కు ఆస్కారంలేకుండా పరిష్కరింపబడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతిచ్చి ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందన్నారు. అర్జీలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

మండలస్థాయిలో ప్రత్యేకాధికారులు సమీక్షించాలి

మండలాల్లో జరుగుతున్న ప్రభుత్వ ప్రాధాన్యతాకార్యక్రమాల అమలు ప్రగతిని సంబంధిత మండల ప్రత్యేకాధికారులు ఆయా మండలాల్లోని అన్నిశాఖల అధికారులతో ప్రతీవారం సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. తద్వారా క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలను సాధించవచ్చన్నారు. గృహనిర్మాణాలు నాడు-నేడు, ఉపాధిహామీ, ప్రభుత్వ ప్రాధాన్యత నిర్మాణాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఐదు రకాలుగా రోగి నుంచి అభిప్రాయ సేకరణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ఏలూరు: ఆరోగ్యశ్రీ కింద అడ్మిషన్ సమయంలో రోగి, వారి వద్ద ఉండే అటెండర్ల నుంచి ఆరోగ్యమిత్రలు కౌన్సెలింగ్ లేఖను తీసుకోవడమే కాకుండా, డిశ్చార్జ్ అయిన తర్వాత రోగినుంచి ఐదు రకాలుగా అభిప్రాయ సేకరణ చేస్తారని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ టి.ఆండ్రూఏలూయిస్ తెలిపారు. ఈ నెల ఆరో తేదీన 'ఆరోగ్యశ్రీలోనూ దోపిడీ' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అందుకు సంబంధించిన వివరణ తెలిపారు. తణుకు పీడీయాట్రిక్ ఎంపానెల్డ్ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో బెడ్‌పై ఉన్న మూడు కేసులు కవర్ చేయబడవని తేలినట్లు తెలిపారు. ఆర్థో, ట్రామా కేసులకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదులూ అందలేదన్నారు. రోగికి మెరుగైన ఇంప్లాంట్లు పెట్టడం కోసం కౌన్సెలింగ్ చేయబోతున్నట్లు వివరించారు. ఆసుపత్రుల్లో ఏదైనా ఫిర్యాదు అందితే అదే డిడిసిలో ఉంచుతారని, ఆ ఆసుపత్రికి జరిమానా విధిస్తారని తెలిపారు. అన్ని అసుపత్రుల్లో మిత్రలు ట్రస్ట్ పోర్టల్ ద్వారా అందించిన ఫీడ్‌బ్యాక్ ఫారంను రోగి నుంచి తీసుకున్న తర్వాత మాత్రమే డిశ్చార్జి ప్రక్రియ పూర్తవుతోందని తెలిపారు. ప్రతి రోగికీ 13 ప్రశ్నలతో కూడిన సమాధానాలను అప్‌లోడ్ చేస్తారన్నారు. అడ్మిషన్ సమయంలో రోగి, అటెండర్ల నుంచి ఆరోగ్యమిత్ర కౌన్సెలింగ్ లేఖను తీసుకుంటారని, డిశ్చార్జి అయిన తర్వాత రోగి నుంచి డిశ్చార్జి ఫీడ్‌బ్యాక్ లెటర్, ఐవిఆర్ఎస్ కాల్స్, 104 అవుట్‌బౌండ్ కాల్స్, 104 ఇన్‌బౌండ్ కాల్స్ ద్వారా అభిప్రాయ సేకరణ జరుగుతోందన్నారు. అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ ఫోన్ నెంబర్లు ప్రదర్శిస్తామని, ప్రతి కియోస్క్‌లో ఫిర్యాదు కోసం 104 కాల్‌సెంటర్ పోస్టర్ అతికిస్తామని తెలిపారు. ట్రస్ట్ మార్గదర్శకాల లబ్ధిదారులకు నగదురహిత చికిత్స అందించాలని ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్డ్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సర్క్యులర్ జారీచేసినట్లు తెలిపారు.

ధర్నా చేస్తున్న కార్మికులు

హెల్త్ అలవెన్స్ కొనసాగించాలని ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ కొనసాగించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బి.బాలరాజు అధ్యక్షతన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ కార్మికులు ఈ ఏడాది జూలైలో పెద్దఎత్తున నాలుగు రోజుల సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో హెల్త్ అలవెన్స్ ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చకపోగా రద్దు చేస్తూ ఏడాదిగా తీసుకున్న అలవెన్స్ మొత్తం తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలని సర్క్యులర్ జారీ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వ నిరంకుశ విధానాన్ని సిఐటియు ఖండిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జి.లక్ష్మణ్, ప్రసాద్, సత్యవతి, పెంటయ్య, వేల్పుల రాజు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డివైఇఒ

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి : డివైఇఒ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోని చదువులో రాణించాలని డివైఇఒ ఎం.రామన్నదొర సూచించారు. జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశా లో మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఇఒ కె.శ్రీనివాస్, హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉమ్మడి జిల్లాలో నిర్వహించే ఆటల పోటీలకు అండర్ 14, అండర్ 17 బాలుర క్రీడలకు సంబంధించి పలు విభాగాల్లో పోలవరం నియోజకవర్గ పరిధిలో ఏడు మండలాల నుంచి టీమ్‌లను ఎంపిక చేయనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బాబు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు జీలుగుమిల్లి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో నిర్వహించిన ఆటల పోటీలను డివైఇఒ ఎం.రామారావుతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం నియోజకవర్గ పరిధిలో 70 టీమ్‌లకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన టీమ్‌లను ఉమ్మడి జిల్లాలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రిన్సిపల్స్ బి.పెద్దిరాజు, రామానాయుడు, ఎస్‌జిఎఫ్ కో-ఆర్డినేటర్ కె.నాగేశ్వరరావు, పీడీలు కె.రమేష్ పాల్గొన్నారు.

'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

ప్రజాశక్తి - చింతలపూడి

నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయని, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్యను అందించడమే లక్ష్యమని సర్పంచి రామకృష్ణ, ఎంపిపి రాంబాబు అన్నారు. మండలంలోని రేచర్ల పంచాయతీ కొమ్ముగూడెం గ్రామంలో నాడునేడు నిధులు ద్వారా పాఠశాల భవన నిర్మాణ పనులకు సోమవారం సర్పంచి, ఎంపిపి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, వెంకట్రామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, యువ నాయకులు చందు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదల పక్షానే పోరాటం : సిపిఐ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

నిరుపేదల పక్షాన సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు అన్నారు. రష్యాలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో వెలగల రామారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లెనిన్ నాయకత్వంలో జారు చక్రవర్తి సామ్రాజ్యాన్ని కూల్చిన తర్వాత రష్యాలో నవంబర్ ఏడో తేదీన సోషలిస్టు రాజ్యం ఏర్పడిందని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అనేక భూ పోరాటాలు నిర్వహించి భూములు పంచిన ఘనత సిపిఐదే అని అన్నారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.బాజీ, నక్క లక్ష్మణరావు, మట్టా రామకృష్ణ, ఎస్.గిరి, రాంబాబు, గోపాలం పాల్గొన్నారు.

15న పాఠశాల పాత సామగ్రి వేలం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం గురుకుల బాలుర పాఠశాలకు చెందిన పాత సామగ్రిని ఈ నెల 15వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ టి.నరసింహస్వామి సోమవారం తెలిపారు. స్థానిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పాత ఇనుము, ఇత్తడి, అల్యూమినియం, స్టీల్, విద్యుత్, ఎలక్ట్రానిక్ వంటి పరికరాలు నిర్ణయించబడిన కమిటీ ఆధ్వర్యంలో వేలం వేయనున్నామని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు పాఠశాలకు తగు గుర్తింపు పత్రాలతో వచ్చి వేలం నిబంధనలను తెలుసుకుని సంతృప్తి చెందిన తరువాతనే తమ పేరును నమోదు చేయించుకోవాలని వివరించారు. వివరాలకు 9866559625 సంప్రదించాలని తెలిపారు.

స్టేట్‌బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

జంగారెడ్డిగూడెం స్టేట్ బ్యాంక్ అందించే సేవలను శ్రీ రామ చంద్ర గ్రూపు సంస్థల ద్వారా పొందవచ్చని ఆ సంస్థల ఛైర్మన్ బివి.కృష్ణారావు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెంలో జంగారెడ్డిగూడెం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీ రామచంద్ర గ్రూపు సంస్థలు సంయుక్తంగా ఖాతాదారులకు సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, సర్పంచి కలపర్తి వెంకటేశ్వరమ్మ, కొత్త ప్రకాష్‌బాబు, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ నారాయణరావు, ఫీల్డ్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, వివిఎస్.జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

కళాశాలలో సర్ సివి.రామన్ జయంతి సభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం సర్ సివి.రామన్ 134వ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. సభకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అణువు నుంచి ఆనందం వరకు మనిషి జీవితం సైన్స్‌తో ముడిపడి ఉందన్నారు. మనిషి జీవితం సుఖవంతం అవ్వడానికి శాస్త్రవేత్తల కృషి వెలకట్టలేనిదన్నారు. ముఖ్య వక్త తాడేపల్లిగూడెం డిఆర్‌జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకులు కె.వెంకట గణేష్ కుమార్ మాట్లాడుతూ సర్ సివి.రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్ పనితీరును విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు బి.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.రెడ్డయ్య, డాక్టర్ కొండా రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ నిర్మాణం

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయి గ్రామ పంచాయతీలోని యాదవ బజారులో ప్రజలకు తాగునీటి సౌకర్యం కోసం పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులను సర్పంచి దామెర ఉష సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి తాగునీటి సౌకర్యం కోసం రూ.పది లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో పైపులైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. వైసిపి నాయకులు దామెర ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు.

హెల్త్ క్లినిక్ సెంటర్ల పనులు పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్ల పనులను జిల్లా వైద్యాధికారి, మండల ప్రత్యేకాధికారి బి.రవి సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జిల్లాస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ముసునూరు పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. లోపూడిలో నిర్మాణంలో ఉన్న హెల్త్ క్లినిక్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి పేరం కృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు వి.ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమసుందర్

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని చింతలపూడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాగంటి సోమసుందర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 125 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వారిలో 70 మంది ఒసి విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. విద్యార్థులందరికీ సాయంత్రం వరకు ప్రత్యేక స్టడీ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. 13 మంది అనుభావం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ఉందని, పదో తరగతి తెలుగు మీడియంలో పాఠ్యబోధన జరుగుతుందని చెప్పారు. పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మెనూ ప్రకారమే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. నాడు-నేడు ద్వారా పాఠశాలకు రూ.13 లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఆ నిధులతో పాఠశాలలో రెండు అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు క్రీడాస్థలం కోసం ఉన్నతాధికారులను కోరామని తెలిపారు.


హెచ్‌ఎం సోమసుందర్

అక్రమ నిర్మాణాలు తొలగించాలని సిపిఎం వినతి


నిడమర్రులో వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు


జంగారెడ్డిగూడెంలో వినతిపత్రం అందిసున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నిడమర్రు

అక్రమ నిర్మాణాలు తొలగించాలని, పంట మురుగు కాలువ బోదెను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనపల్లిలో మురుగు వెళ్లేందుకు, రైతుల రాకపోకలకు ఆటంకం కలుగుతుందని, అధికారులు స్పందించి సర్వే చేసే హద్దులు ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, కోడూరు త్రిమూర్తులు, అలుమోలు నాగరాజు, కోడూరి మాణిక్యం, పెదకాపు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని...

జంగారెడ్డిగూడెం : పట్టణంలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె. సుభాషిణి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లా డుతూ ఏలూరు రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, వర్షాలు వస్తే రోడ్డు మీదే మురుగు నీరు ప్రవహిస్తుందన్నారు. రోడ్డు మార్జిన్‌లో చిరు వ్యాపారులు నష్టపోతున్నారన్నారు. అక్కడ పేరుకు పోయిన చెత్త వల్ల తీవ్ర అనారోగ్యాలు వ్యాపిస్తాయన్నారు. డ్రెయినేజీ నిర్మించాలని, ప్రస్తుతం పూడికలు తీయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ చాంద్ బాషా, సునీల్ నాని పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆన్‌లైన్ మోసాల పట్ల, ఉద్యోగాల పేరిట మోసం చేసేవారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటివారు ఎవరైనా తారసపడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ సూచించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్‌పి ఫిర్యాదుదారుల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులపై ఎస్‌పి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఉద్యోగాలు పేరిట మోసాలకు పాల్పడుతుంటే వారి వివరాలను తమకు తెలియజేయాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని కోర్సవారిగూడెం గ్రామంలో హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కాటన్ దొర జంగారెడ్డిగూడెం హాస్పిటల్ వైద్య నిపుణులతో ఈ నెల 7, 8 తేదీల్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక పాస్టర్ జి.ఫిలిప్ తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతవాసులు ఈ శిబిరంలో అందించే సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. వైద్య పరీక్షల కోసం వచ్చినవారికి ఉచిత భోజన సదుపాయాలతో పాటు ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు.

బాధిత మహిళకు సాయం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దొరమమిడి గ్రామానికి చెందిన పొన్నాటి చిన దుర్గయ్య(53) అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామ సర్పంచి తెల్లం రాముడు దుర్గయ్య భార్య మంగకు రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. మృతుడు దుర్గయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేణుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల మన్ననలు పొందుతూ ఆదర్శ ఉపాధ్యాయులుగా ఉండాలని భారతి విద్యా నికేతన్ ప్రిన్సిపల్ కొండేటి శౌరి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు భారతి విద్యానికేతన్ పాఠశాలలో నక్కనబోయిన వేణు ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఆయన లోకసత్తా రాష్ట్ర నాయకులు, పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ చేతులమీదగా ఉత్తమ ఉపాధ్యాయ ఆవార్డు అందుకున్నారు. అ సందర్భంగా వేణును పలువురు అభినందించారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పురపాలక సంఘం పరిధిలోని ఐదో సచివాలయ పరిధిలోని 14వ వార్డులో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ఎలిజా పాల్గొన్నారు. రామచంద్రపురం గట్టు తదితర ప్రాంత ప్రజలు డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎంఎల్‌ఎ స్పందించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు, రీజనల్ డైరెక్టర్ ఆఫ్ చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ వందనపు సాయి బాలపద్మ, 14వ వార్డ్ కౌన్సిలర్ తాతకుంట్ల వెంకటలక్ష్మి, ఆరో వార్డ్ కౌన్సిలర్ నేకూరి కిషోర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, గ్రామ సర్పంచి బోయిన విమల, విద్యుత్ శాఖ ఎఇ పేర్ని రవికుమార్, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, పార్టీ నేతుల పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో పాత విధానం అమలు చేయాలి

ఉంగుటూరు మండల సర్వసభ్య సమావేశంలో దొంతవరం సర్పంచి


సర్వసభ్య సమావేశంలో ఎంపిపి శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ధాన్యం సేకరణలో పాత విధానం అమలు చేయాలని, కొత్త విధానంలో తేమ శాతం 17 కంటే తక్కువ ఉండాలనే నిబంధనలతో సన్న, చిన్నకారు రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని దొంతవరం సర్పంచి కంభంపాటి సత్యవతి సూరిబాబు అన్నారు. సార్వా కోతలు ప్రారంభమై పది రోజులు అవుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం తరపున ధాన్యం కొనుగోలు కేంద్రాలు మొదలు కాకపోవడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందంటూ పలువురు సర్పంచులు వాపోయారు. ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ధాన్యం సేకరణలో పాత విధానం అమలు చేయాలని దొంతవరం సర్పంచి సత్యవతి సూరిబాబు సభ దృష్టికి తెచ్చారు. ఆరుదల ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాల్సి ఉందని అలా అయితేనే మంచి ధర వస్తుందని నారాయణపురం సొసైటీ ఛైర్‌పర్సన్ యెలిశెట్టి పాపారావుబాబ్జి సమాధానం చెప్పారు. పాత విధానంతో రైతులు నష్టపోతున్నారని అందుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తేమ శాతం 17 ఉన్న వాటినే సేకరిస్తామన్నారు. దొంతవరం శివారు తోటరామచంద్రపురం వరకు విద్యుత్ లైన్‌పైనే వందలాది ఎకరాల చేపల చెరువులకు కనెక్షన్లు ఇచ్చారని, దీంతో లోఓల్టేజితో దొంతవరం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచి చెప్పారు. విఎ పురంలో జగనన్న గృహాలకోసం డబ్బులు అడుగుతున్నారని సర్పంచి ధనలక్ష్మి ఆరోపించగా నిర్దిష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. నారాయణపురంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం సేకరించిన స్థలం మెరక పనులకు సంబంధించి తమకు సమాచారం ఇవ్వరా అంటూ ఎంపిటిసి సభ్యులు బండారు నాగ వెంకట సత్యనారాయణ ప్రశ్నించారు. గ్రామాల్లో చేసిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరవ్వక ఇబ్బందులు పడుతున్నారని పలువురు సర్పంచులు వాపోయారు. తమ పంచాయతీకి కంప్యూటర్ ఇవ్వకుండానే బిల్లు చెల్లించాలని కోరడంపై దొంతవరం సర్పంచి సత్యవతి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విచారణ చేస్తామని ఇఒపిఆర్‌డి షంషుద్దీన్ చెప్పారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైస్ ఎంపిపిలు మేడవరపు ఈశ్వరి విద్యాలక్ష్మి, సింగులూరి సూర్యనారాయణ, ఎంపిడిఒ నందిపాటి ప్రేమాన్విత, తహశీల్దార్ ఎవి.రమణరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అధికార పార్టీ సభ్యులే సమస్యలను లేవనెత్తటంపై సభానంతరం ఆ పార్టీ నేతలు చర్చించుకున్నారు.

అకారణంగా దుకాణం తొలగించారు

బాధితుడి ఆవేదన

ప్రజాశక్తి - ముదినేపల్లి

పోలీసులు అకారణంగా తన దుకాణం తొలగించారంటూ మండలంలోని పెయ్యేరు కాలనీకి చెందిన దళిత కుటుంబం అవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలంటూ దళిత నాయకులను ఆశ్రయించారు. పెయ్యేరు కాలనీకి చెందిన గోన నాగయ్య గత 20 ఏళ్లుగా స్థానిక బంటుమిల్లి రోడ్డులో మాంసం దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు జెసిబితో తన దుకాణం తొలగించారంటూ బోరున విలపించాడు. ఎస్‌సి మాదిగ సామాజిక తరగతికి చెందిన తాను ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా దుకాణం నిర్వహించుకుంటున్నానని చెప్పారు. దుకాణం వెనుక ఉన్న అగ్ర సామాజికి తరగతికి చెందినవారు రాజకీయ నాయకుల అండతో తన దుకాణం తొలగించారన్నారు. ఉదయమే నోటీసులు ఇచ్చి వెంటనే తీసేయమన్నారని వాపోయాడు. రెండు రోజులు కూడా సమయం ఇవ్వకుండా పోలీసులు జెసిబితో దుకాణం తొలగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదంటూ వాపోయాడు. ఈ విషయమై మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు శేవా బాబూరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో మాల, మాదిగల మీద దౌర్జన్యలు జరుగుతున్నాయని, అకారణంగా దుకాణం తొలగించిన నాగయ్యకు న్యాయం జరిగే వరకు దళిత సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని చెప్పారు.

కళాశాలకు ఫ్యాన్లు బహుకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు లయన్స్ క్లబ్ అధ్వర్యంలో ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు 8 సీలింగ్ ఫ్యాన్లను హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కె.రామచంద్రరావు అందించారు. వాటిని స్థానిక కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబుకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో సహకారం అందించిన లయన్స్ సభ్యులు అభినందనీయులన్నారు. డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు కూడా ఉన్నత స్థానానికి చేరి భవిష్యత్‌లో సమాజానికి తమ వంతు సహకారం అందించాలన్నారు. లయన్స్ జిల్లా నాయుకులు ఎల్.వెంకటేశ్వరావు, జోన్ ఛైర్మన్ వి.రత్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇష్టంతో కష్టపడి చదివి ఎదగాలన్నారు. కళాశాలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్ కుమార్, అధ్యాపకులు వి.వెంకటరావు, క్లబ్ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, కోశాధికారి కె.బాలసుబ్రహ్మణ్యం, సభ్యులు వేమా రామచంద్రరావు, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్యాన్లు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

దళిత మహిళా రైతులకు శాశ్వత పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో దళిత మహిళా రైతులకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ దళిత సేన భూ పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సేన భూ పోరాట సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనాది నుంచి ఇప్పటివరకూ ప్రభుత్వ అసైన్డ్ గ్రామ కంఠ పోడు భూములు, సాగు చేసుకుంటూ జీవిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి మహిళా రైతులు, బడుగు బలహీన వెనుకబడిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి భూ హక్కు కల్పిస్తూ శాశ్వత పట్టాలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళితసేన లింగపాలెం మండల అధ్యక్షులు లక్కపాము చంటి, దళిత సేన లింగపాలెం మండల సలహా అధ్యక్షులు స్టాలిన్, దళిత సేన లింగపాలెం మండల ప్రధాన కార్యదర్శి బూల్లా రవికుమార్, దళిత సేన లింగపాలెం మండల కార్యదర్శి వి.సురేష్, దళిత సేన తోచిలక రాయుడుపాలెం గ్రామ అధ్యక్షులు పెల్లంగి ఇతియా, ఎడవల్లి దళిత సేన నాయకులు రామారావు, దళిత సేన మహిళా రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను వ్యసనాలకు దూరంగా ఉంచాలి

ప్రజాశక్తి - నూజివీడు

విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. నూజివీడు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో జయప్రకాష్ నారాయణ మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు గురికాకుండా తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా బాధ్యత వహించి మార్పుదిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, అభిమానులు, ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - నూజివీడు

వృద్ధులను, తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని, వారికి అండగా ఉండాలని నూజివీడు డిఎస్‌పి బి.శ్రీని వాసులు అన్నారు. మండలంలోని తుక్కులూరులోని జెబిఎల్ వృద్ధాశ్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ రాధాకృష్ణరెడ్డి సౌజన్యంతో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ ఆర్.అంకబాబు, రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానంలో డిఎస్‌పి, సిబ్బంది

డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పట్టణంలోని డ్రెయినేజీలపై అక్రమ నిర్మాణాలు వారంరోజుల్లోపు తొలగించాలని నగరపంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొందరు డ్రెయినేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని వాటిని ఇచ్చిన గడువులోపు తొలగించాలని, లేనిపక్షంలో తామే తొలగిస్తామని హెచ్చరించారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి

ఏలూరు అర్బన్: దేశంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి అనుసరిస్తున్న ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా విప్లవోద్యమ అమరవీరుల స్ఫూర్తితో ప్రజలు పోరాడాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. విప్లవోద్యమ త్యాగమూర్తులను స్మరిస్తూ ఈనెల ఒకటో తేదీ నుండి 11వ తేదీ వరకూ అమరవీరుల సంస్మరణ సభల నిర్వహణలో భాగంగా సోమవారం స్థానిక మార్కెట్ యార్డు అమరవీరుల స్థూపం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యువి, నగర నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం 50 సంవత్సరాలుగా సాగుతున్న విప్లవో ద్యమంలో చాలామంది తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు అనుబంధ మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ మంగరాజు రాము, నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్టోబర్ విప్లవం స్ఫూర్తిదాయకం

ఏలూరు అర్బన్: అక్టోబర్ విప్లవస్ఫూర్తితో పోరాటాలను కొనసాగించాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో 1917 అక్టోబర్‌లో జరిగిన మహత్తర అక్టోబరు సోషలిస్టు ఉద్యమ విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం అత్యంత ప్రభావాన్ని ప్రపంచం మీద చూపిందని కొనియాడారు. అనేక దేశాలు అక్టోబర్ సోషలిస్టు విప్లవస్ఫూర్తితో సోషలిస్టు, కమ్యూనిస్టు దేశాలుగా ఏర్పడ్డాయని అంతటి గొప్ప స్ఫూర్తితో భారతదేశంలో కూడా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి దేశ స్వాతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు.

తల్లులు పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

ఏలూరు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి ఆదివారం ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవ సందర్భంగా ఏలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసులో అంగన్‌వాడీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ గర్భస్థ శిశువు నుండి బిడ్డకు రాజ్యాంగం భద్రత కల్పించిందని, శిశువుకు గర్భం నుండి పౌష్టికాహారాన్ని తల్లి ద్వారా అందిస్తున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : సుబ్బమ్మదేవి హైస్కూల్ రోడ్డు, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మీథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
1st ఫ్లోర్, బస్‌స్టాప్ ఎదురు, దేవరపల్లి.
1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పలవెంకన్న సెంటర్,వేల్పూరురోడ్డు, తణుకు
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25.11.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 648.41 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు: డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికి మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనలు కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, భీమవరం
O.S. 81/2022

బిట్వీన్:
కొత్తపల్లి బంగార్రాజు -వాది
మరియు
కొత్తపల్లి వీర హనుమాన్‌రాజు, వగైరాలు -ప్రతివాదులు

To:
2వ ప్రతివాది:
కొత్తపల్లి జ్యోతి కుమార్‌రాజు, S/o. వీర హనుమాన్‌రాజు, 43 సం॥లు, ఇంటి నెం. 11-100, మెయిన్‌రోడ్డు, పాలకోడేరు గ్రామం మరియు మండలం, భీమవరం జిల్లా, PC No. 534210.

పై నెంబరు దావాలో మీకు సమను అమలు నిమిత్తం యీ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై కేసులో మీ హాజరు నిమిత్తం ది. 07-12-2022కు వాయిదా వేసినారు. కావున సదరు తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతిన)
కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు
పత్సమట్ల మురళీకృష్ణ సుబ్బరాజు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
సెల్: 9440341961

మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, భీమవరం
I.A. 25/2022, O.S. 81/2022

బిట్వీన్:
కొత్తపల్లి బంగార్రాజు -పిటీషనరు
మరియు
కొత్తపల్లి వీర హనుమాన్‌రాజు, వగైరాలు -రెస్పాండెంట్లు

To:
2వ రెస్పాండెంటు:
కొత్తపల్లి జ్యోతి కుమార్‌రాజు, S/o. వీర హనుమాన్‌రాజు, 43 సం॥లు, ఇంటి నెం. 11-100, మెయిన్‌రోడ్డు, పాలకోడేరు గ్రామం మరియు మండలం, భీమవరం జిల్లా, PC No. 534210.

పై నెంబరు దావాలో మీకు నోటీసు అమలు నిమిత్తం యీ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై కేసులో మీ హాజరు నిమిత్తం ది. 07-12-2022కు వాయిదా వేసినారు. కావున సదరు తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతిన)
కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు
పత్సమట్ల మురళీకృష్ణ సుబ్బరాజు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
సెల్: 9440341961